క్లుప్తంగా

'ఉపాధి హామీ' నిర్వీర్యానికి కుట్ర

బూర్గంపాడు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బత్తుల వెంకటేశ్వర్లు ఆరోపించారు. బూర్గంపాడుకు సమీపంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనిప్రాంతాలలో కూలీలకు కనీస వసతులు కూడా కల్పించడం లేదన్నారు. గతంలో గడ్డపారలు, మంచినీరు, రవాణా చార్జీలు ఇచ్చేవారని, ఇప్పుడు ఏమీ ఇవ్వటం లేదన్నారు. కార్యక్రమంలో కుమారి, ఉమ, పుల్లయ్య, ఆదెమ్మ, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తికి సపర్యలు

అశ్వాపురం: మతిస్థిమితం లేక రోడ్డు వెంబడి ఉంటున్న ఓ వ్యక్తికి మండల పరిధిలోని మొండికుంటలోని పలువురు సపర్యలు చేశారు. గత కొంత కాలంగా ఓ మతిస్థిమితం లేని వ్యక్తి రోడ్డు పక్కన కూర్చొని ఉంటున్నాడు. మాసిపోయిన బట్టలు, పెరిగిన గడ్డంతో ఉన్న అతనిని కొందరు ఛీ ఛీ అనుకుంటే.. మరి కొందరు పిచ్చివాడని దూరంగా వెళ్లడం పరిపాటిగా మారింది. కాగా చుట్టూ పక్కల దుకాణాలకు చెందిన మేడిపల్లి రాజేష్, మాసిరెడ్డి వెంకటరెడ్డి, జంపాల ఉపేందర్, మేడిపల్లి సురేష్, ఉపాధ్యాయుడు మిట్టకంటి రామిరెడ్డి బుధవారం మతిస్థిమితం లేని వ్యక్తికి జట్టు తొలగించి కొత్త బట్టలు వేసి నవ యువకుడులా తయారు చేశారు. మానవత్వం చాటుకున్న గ్రామస్తులను పలువురు అభినందించారు.

పుస్తకాల పంపిణీ

మణుగూరురూరల్: మండలంలోని ముత్యాలమ్మనగర్ గ్రామపంచాయతీ సంతోష్‌నగర్‌లో ఉన్న బాలవెలుగు పాఠశాలలో భారత జాగృతి ఆధ్వర్యంలో జాగృతి వ్యవస్థాపకురాలు, నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సమక్షంలో జాగృతి నాయకులు కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 60మంది విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, చాక్లెట్లు, బిస్కెట్లు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జాగృతి నాయకులు పవన్ నాయక్, ప్రతాప్, శివకృష్ణ, ఆదిత్య, చందు, మోబిన్, ఉదయ్, విక్కి, వర్ధన్ సాయి, పాఠశాల నిర్వాహకులు బి.జగన్మోహన్‌రెడ్డి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం..

భద్రాచలంటౌన్: భద్రాచలం డివిజన్‌లోని పంచాయతీ శాఖ టెక్నికల్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో బుధవారం పంచాయతీ శాఖ టెక్నికల్ విభాగం ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే వెంకట్రావ్ సీఎం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

చేతిపంపు ఏర్పాటు

చంద్రుగొండ: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆదేశాల మేరకు బుధవారం చేతిపంపు నిర్మాణం చేసినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకుడు బొర్రా సురేష్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బొర్రా లలిత, తాజా మాజీ సర్పంచ్ పూసం వెంకటేశ్వర్లు, ఫజల్ పాల్గొన్నారు.

పరీక్ష సామగ్రి అందజేత

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల సెంటర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని టెన్త్ విద్యార్థులకు ధరణి ఫౌండేషన్ భద్రాచలం వారు బుధవారం పరీక్ష సామగ్రి అందజేశారు. టెన్త్ పరీక్షల సమయంలో విద్యార్థులకు ఉపయోగపడే జామెంట్రీ బాక్స్, వాటర్ బాటిల్స్, పెన్నులు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ధరణి ఫౌండేషన్ వ్యవస్థపకుడు చైతన్య, పాఠశాల హెచ్ఎమ్ పద్మజ పాల్గొన్నారు.

దమ్మపేట: మండల కాంగ్రెస్ నాయకులు చిన్నశెట్టి యుగంధర్.. ఆయన కుమారుడు పవన్‌కుమార్ జ్ఞాపకార్థంగా పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లను వితరణగా అందజేశారు. బుధవారం దమ్మపేట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన చిన్నశెట్టి యుగంధర్ వాటిని అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం .ఉషారాణి, జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు

ములకలపల్లి: మండలపరిధిలోని పాతగంగారం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం సామూహిక సీమంతాలు చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ్ కార్యక్రమంలో పాల్గొన్న సూపర్‌వైజర్లు నాగమణి మాట్లాడారు. పోషకాహార అవశ్యతకతను వివరించారు. తల్లులచేత పోషకాహార ప్రతిజ్ఞ చేయించారు. హెల్త్ సూపర్‌వైజర్ ధనలక్ష్మి, హెచ్ఎం నాగమణి, ఏడబ్ల్యూటీ సునిత, అరుణ, రజని, సరోజిని, తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కలతో బెంబేలు

- వీధుల్లో గుంపులుగా తిరుగుతున్న శునకాలు
- పాదచారులు, వాహనదారుల వెంబడి పరుగులు
- భయభ్రాంతులకు గురవుతున్న ప్రజానీకం



ఆర్ కొత్తగూడెంలో సంచరిస్తున్న వీధి కుక్కలు

చర్ల: మండలంలో వీధి కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టకపోవడంతో అవి ప్రజానీకాన్ని హడలెత్తిస్తున్నాయి. మండల కేంద్రంతో పాటు, పలు గ్రామాల్లో వీధి కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ పాదచారులను, ద్విచక్రవాహనాదారులను ఆందోళనలకు గురి చేస్తున్నాయి. మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్, గాంధీ సెంటర్, అంబేడ్కర్ సెంటర్లతో పాటు తేగడ, కలివేరు, ఆర్ కొత్తగూడెం, కుదునూరు, కొయ్యూరు తదితర గ్రామాలలో వీది కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తుండడంతో వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఇళ్లల్లో నుంచి భయటకు వచ్చేందుకు జంకుతున్నారు. వీధులలో గుంపులు గుంపులుగా తిరుగుతున్న వీది కుక్కలు ఎప్పుడు ఎవరి మీద దాడి చేస్తాయో అర్థం కాక బయటకు వచ్చే పలువురు చేతుల్లో కర్రలు పట్టుకొని తిరుగుతున్నారు.

300పైగా వీధి కుక్కలు..

మండల కేంద్రంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో సుమారు 300కు పైగానే వీది కుక్కలు ఉన్నట్లుగా తెలుస్తోంది. ఈ స్థాయిలో ఉండడంతో కుక్కల సంచారం కారణంగా ప్రజలు ఒంటరిగా బయటకు వెళ్లలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. భయమేస్తోందని వాపోతున్నారు. రోడ్లపై వెళ్తున్న ద్విచక్ర వాహనాలు, ఆటోలు, కార్ల మీదకు దూసుకుపోతున్న కుక్కలను తప్పించుకుపోయే ప్రయత్నాల్లో పలువురు వాహనాదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని వారు వాపోతున్నారు. రాత్రి వేళల్లో వీధుల్లో చేరి అవి చేస్తున్న అరుపులతో నిద్రపట్టడం లేదని పేర్కొంటున్నారు. గ్రామాల్లో పెంపుడు కోళ్ల ఇళ్ల బయటకు వెళ్తే వాటిని పరుగెత్తించి పరుగెత్తించి పట్టి చంపి తింటున్నాయని, వీటితో పాటు, మేకలపై కూడా వీధి కుక్కలు మూకుమ్మడిగా దాడి చేస్తూ వాటిని హతమారుస్తున్నాయని, ఆవులు, గేదెలను సైతం కరుస్తున్నాయంటూ పలువురు వాపోతున్నారు.

చర్యలు శూన్యం..

చర్ల మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధి కుక్కల నియంత్రణకు పంచాయతీ బాధ్యులు ఏ విధమైన చర్యలూ తీసుకోవడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. ఒక కుక్కలు, మరో ప్రక్క వీధి కుక్కలతో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నామని పలువురు వాపోతున్నారు. కుక్కకాట్ల బారిన పడి పలువురు గాయపడుతున్నప్పటికీ వీనిని తరలించేందుకు చర్యలు చేపట్టకపోవడంపై జనం అధికారుల తీరును తీవ్రంగా తప్పు పడుతున్నారు.

తక్షణమే మండల కేంద్రంతో పాటు గ్రామాలలో సంచరిస్తున్న వీధి కుక్కలను తరలించేందుకు పంచాయతీలు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

వీధి కుక్కలను తరలించాలి



గ్రామాల్లో గుంపులు గుంపులుగా సంచరిస్తూ ప్రజలను గాయపరుస్తూ వాహనదారులను ప్రమాదాలకు గురి చేస్తున్న వీధి కుక్కలను తరలించారు. కుక్కల వ్యవహారం పంచాయతీ అధికారులకు తెలిసినప్పటికీ వాటిని తరలించేందుకు చర్యలు తీసుకోవడం లేదు. వెంటనే గ్రామాల్లోని వీది కుక్కలను తరలించాలి.

– వై.గిరిబాబు, ఆర్ కొత్తగూడెం

చర్యలు తీసుకుంటాం



గుంపులు గుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు మనుషులను, పశువులను కరవడంతో పాటు వచ్చి పోయే వాహనాల మీదకు వెళ్తున్నాయని, ఆ వాహనాలు ప్రమాదాల బారిన పడే విధంగా చేస్తున్నాయని పలువురు ఫిర్యాదు చేశారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో సంచరిస్తున్న వీధి కుక్కలను తరలించేందుకు చర్యలు తీసుకుంటాం.

– ఈదయ్య, ఎంపీడీఓ, చర్ల

విద్యార్థులకు వీడ్కోలు సమావేశం



దుమ్ముగూడెం: వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ చంద్రశేఖర్

అశ్వారావుపేట: పదో తరగతి విద్యార్థులు 10కి 10జీపీఏ సాధించాలని అశ్వారావుపేట ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామమూర్తి ఆకాంక్షించారు. బుధవారం స్థానికి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలికోన్నత పాఠశాలల పదో తరగతి విద్యార్థులకు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సీహెచ్.వెంకయ్య, పి.హరిత, సీఆర్పీ ప్రభాకరాచార్యులు, ఉపాధ్యాయులు నరసింహారావు, బాలస్వామి, కొండలరావు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: పదో తరగతి పరీక్షలను విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో రాయాలని తహసీల్దార్ చంద్రశేఖర్ విద్యార్థులకు సూచించారు. బుధవారం నర్సాపురం గ్రామంలోని సూదిరెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో 10 విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడారు. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన పది పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.వెంకటేశ్వర్లు,పాఠశాల ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ గోపాల్

భద్రాచలంటౌన్: భద్రాచలం కూనవరం రోడ్‌లోని శ్రీవిద్య స్కూల్ విద్యార్థులు ఆల్ ఇండియా స్థాయిలో ప్రతిభను చాటారు. 2023–24 నేషనల్ లెవెల్ సైన్స్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్‌లో విద్యార్థులు ఆద్య, సాయి అమూల్య 95వ ర్యాంక్, తణ్మయి, హేమ సాత్విక, దేదీప్యా 484 ర్యాంక్‌లు సాధించారు. జాతీయ స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులను స్కూల్ చైర్మన్ ఎల్ఎస్ చౌదరి, సీఈఓ చైతన్య కృష్ణ, ప్రిన్సిపాల్ గోపాల్, వైస్ ప్రిన్సిపాల్ రమ్య శ్రీ, రాజేష్, రాంబాబు అభినందించారు.

'హక్కులను కాలరాస్తున్న కేంద్రం'

బూర్గంపాడు: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలం చెల్లిన మనుధర్మ సిద్ధాంతాలను రాజ్యాంగ బద్ధం చేసేందుకు కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ప్రగతిశీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) డివిజన్ కార్యదర్శి సున్నం భూలక్ష్మి ఆరోపించారు. పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో అంతర్జాతీయ శ్రామిక మహిళా పోరాట దినోత్సవాల్లో భాగంగా బుధవారం బూర్గంపాడులో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా రిజర్వేషన్ల పేరుతో ఓట్లు దండుకునేందుకు బీజేపీ ప్రభుత్వం ముమ్మర ప్రయత్నాలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎన్డీ నాయకులు డి.పున్నంచంద్, పీఓడబ్ల్యూ నాయకులు బండ్ల కమల, కుర్సం సుజాత, సాడె అచ్చమ్మ, గలిగ నర్సమ్మ, మోతుకురి అంజలి, కణితి వెంకటమ్మ, కారం రమణ, సోయం లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సరైన యాజమాన్య పద్ధతులే కీలకం



రైతు శిక్షణలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త గోపాలకృష్ణమూర్తి

అశ్వారావుపేటరూరల్: సమగ్ర యాజమాన్య పద్ధతులతోనే ప్రధాన పంటలలో చీడ పీడల నివారణ సాధ్యమని స్థానిక వ్యవసాయ కళాశాల సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.గోపాలకృష్ణమూర్తి అన్నారు. బుధవారం మండలంలోని నారాయణపురం గ్రామం రైతువేదిక ఆవరణలో రైతులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పురుగుల ఉధృతి తక్కువగా ఉన్నప్పుడు వేప నూనె వంటి జీవ సంబంధమైన కీటక నాసినిలను పిచకారీ చేయాలని సూచించారు. సమగ్ర యాజమాన్యంలో లింక ఆకర్షక బుట్టలు, పక్షిస్థావరాలు, దీపపు ఎరలు, రక్షక పంటలు వంటి ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించారు. అనంతరం పలువురు శాస్త్రవేత్తలు మాట్లాడుతూ.. ప్రధాన పంటల్లో ప్రస్తుతం ఉన్న చీడ, పీడలు నివారణ, పంటల సాగులో పాటించాల్సిన మేలైన శాస్త్రీయ యాజమాన్య పద్ధతులు, జీవ రసాయనాల ప్రాముఖ్యత, పోషకాల యాజమాన్యం, పంటల సాగులో యాంత్రికరణ ఆవశ్యకత అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు.

అనంతరం గ్రామంలోని పంట పొలాలు, పామాయిల్ తోటలను సందర్శించారు. ఈ సందర్శనలో ఆయిల్‌పాం తోటల్లో కొమ్ము మొక్కు పురుగు ఉధృతిని గుర్తించారు. వీటి నివారణకు తోటలకు కార్బో ఫ్యూరాన్ గులికలను మొక్క మొవ్వలో వేసుకోవడంతోపాటు పశువుల ఎరువును ప్రతి చెట్టుకూ 2 నుంచి 5కేజీల వేప పిండిని వేసుకోవాలని సూచించారు. అదే విధంగా బోరాన్ లోప నివారణ కోసం ప్రతి మొక్కకు 100 కిలోల బోరాక్స్‌ను రెండు సమాన భాగాలుగా చేసుకోని జూన్, జూలై మాసాల్లో సగం, జనవరి నెలలో మిగిలిన సగం వేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రొఫెసర్లు డాక్టర్ కే నాగాంజలి, డాక్టర్ జంబమ్మ, డాక్టర్ ఎం.రాంప్రసాద్, డాక్టర్ పావని, డాక్టర్ పి.రెడ్డి ప్రియ పాల్గొన్నారు.

ఫుడ్ కాంపిటీషన్

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్యనగర్‌లోని బ్రైట్ మైండ్స్ ప్లే స్కూల్‌లో విద్యార్థుల తల్లితండ్రులకు బుధవారం ఫుడ్ కాంపిటీషన్ నిర్వహించారు. విద్యార్థుల ఎదుగుదలకు అవసరమయ్యే పౌష్టికాహారం స్టాల్స్ ఏర్పాటు చేసిన తల్లులను పాఠశాల కరస్పాండెంట్ రాంబాబు అభినందించారు. అనంతరం తయారు చేసిన వంటకాలను పరిశీలించి వాటిల్లోని పోషకాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రీష్మ తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరం

చర్లరూరల్: మండలంలోని క్రాంతిపురంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. జ్వరాలతో బాధపడుతున్న వారికి వైద్యం అందిచారు. దోమలు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా చూసుకోవాలని డాక్టర్ శ్రీధర్ కోరారు. కాచి చల్లార్చిన నీటినే తాగాలని సూచించారు. కుష్ఠు వ్యాధిగ్రస్తుల సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రామలక్ష్మి, వేణుగోపాల కృష్ణ, రాంప్రసాద్, హైమావతి, సబిత తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన

అశ్వారావుపేటరూరల్: మండల కేంద్రంలోని పేటమాలపల్లిలోగల అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం చిరు ధాన్యాలపై అవగాహన కల్పించారు. పోషణ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు చిరుధ్యాన్యాల గురించి స్థానిక సీడీపీఓ రోజా రాణి ఆధ్వర్యంలో రాగి జావను తయారీ చేసి వివరించారు. చిరు ధాన్యాలతో కూడిన ఆహారాన్ని క్రమంతప్పకుండా తీసుకుంటే కలిగే ప్రయోజనాలకు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అల్లాడి రామారావు, సూపర్‌వైజర్లు కే విజయలక్ష్మి, ఇమ్మడి పద్మావతి, వరలక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఖాళీలను భర్తీ చేయాలి

భద్రాచలంటౌన్: జిల్లాలోని ఏకలవ్య మోడల్ పాఠశాలలో ఉన్న ఖాళీ ఉద్యోగాలను ఆదివాసీ నిరుద్యోగులతో భర్తీ చేయాలని ఏవీఎస్పీ డివిజన్ అధ్యక్షుడు సొందె మల్లు దొర భద్రాచలం ఐటీడీఏ పీఓకి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ఈ ఖాళీలను భర్తీ చేసేందుకు ఇన్‌చార్జ్‌గా ఉన్న ఏపీఓ డేవిడ్ రాజ్ నోటిఫికేషన్ ఇవ్వగా అనేక మంది ఆదివాసీ గిరిజనులు దరఖాస్తు చేసుకున్నారని, కానీ ఇప్పటి వరకు వాటి సంబంధించి పూర్తి సమాచారం సంబంధిత అధికారులు ఇవ్వడం లేదని పీఓ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. ఏకలవ్య మోడల్ స్కూల్స్‌లో ఖాళీలు అలానే ఉన్నాయని, త్వరలోనే ఉన్నతాధికారలతో చర్చించి ఉద్యోగాల భర్తీ చేస్తామని పీఓ హామీ ఇచ్చినట్లు ఆయన తెలిపారు.

వైభవంగా నాగ ప్రతిష్ఠ

బూర్గంపాడు: సారపాకలోని సాకేతపురి ఆంజనేయస్వామి మందిర ఆవరణలో సుబ్రహ్మణ్యస్వామి నాగ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. బుధవారం సుబ్రహ్మణ్యస్వామి నాగ ప్రతిష్ఠ అనంతరం సర్పసూక్త హోమం, అభిషేకాలు, పూర్ణాహుతి, అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజా పాలనతోనే న్యాయం



కరకగూడెం: మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

కరకగూడెం: కాంగ్రెస్ ప్రభుత్వంలోని ప్రజా పాలనతోనే అన్నివర్గాల వారికి న్యాయం జరుగుతున్నదని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని 25 మంది లబ్దిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలోనే బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలు, రైతులు, రైతు కూలీలు, పేదలకు న్యాయం జరుగుతుందని అన్నారు. అంతేకాకుండా ఇప్పటికే ఎన్నికల సమయంలో ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేస్తూ మాట నిలబెట్టుకున్న ప్రజా ప్రభుత్వం కాంగ్రెస్సేనని అన్నారు. మండలంలో ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని తెలియజేశారు. అనంతరం కార్యాలయ సిబ్బంది శాలువలతో సన్మానించారు. కార్యాలయంలో తహసీల్దార్ నాగ ప్రసాద్, డీటీ సంధ్య, వైస్ ఎంపీపీ శైలేజా, ఎంపీటీసీ మునింద్ర, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మణుగూరుటౌన్: తన హయాంలో ఐటీఐ కళాశాల, డిగ్రీ కాలేజీలతో పాటు, రెసిడెన్షియల్ కళాశాలల ఏర్పాటుకు కృషి చేశానని, ఎందరో ఉన్నతులు చదివిన పాత మణుగూరు గర్ల్స్ హైస్కూల్‌లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పాత మణుగూరులోని గర్ల్స్ హైస్కూల్‌లో జరిగిన స్కూల్ కాంప్లెక్స్ టీఎల్ఎం మేళ, పాఠశాల వార్షికోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. తాను ఇదే పాఠశాలలో 6వ తరగతి నుంచి 10 వరకు చదివానని, హెచ్ఎం స్వర్ణ తన దృష్టికి తీసుకొచ్చిన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. అనంతరం గతేడాది పది ఫలితాల్లోని పాఠ్యాంశాలలో 100 శాతం ఉత్తీర్ణతకు కృషి చేసిన ఉపాధ్యాయులకు మెమొంటోలు అందజేశారు. లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోర్ట్స్ టీషర్ట్స్ అందజేశారు. కార్యక్రమంలో బ్రహ్మయ్య, కోటేశ్వరరావు, రామిరెడ్డి, నాగుల్ మీరా, లయన్స్ క్లబ్ వ్యవస్థాపకులు పిల్లారిశెట్టి హరిబాబు, కాంగ్రెస్ నాయకులు సామా శ్రీనివాస రెడ్డి, దొబ్బల వెంకటప్పయ్య, కూచిపూడి బాబు, పాతూరి వెంకన్న, శివ, వాసవీక్లబ్ సభ్యులు బండారు నర్సింహారావు, కేసా ప్రసాద్‌రావు, బొగ్గవరపు అంజలి తదితరులు ఉన్నారు.

ఉపాధిహామీ పనుల్లో అవకతవకలు



ప్రజా వేదికలో డీఆర్‌డీఏ ఏపీడీ రవి, ఎంపీపీ సుజాత, ఎంపీడీఓ వరప్రసాద్

అశ్వాపురం: మండలంలో 2022–23 సంవత్సరంలో జరిగిన మహత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదికను మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం నిర్వహించారు. ప్రజావేధికకు డీఆర్‌డీఏ ఏపీడీ రవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏప్రిల్ 2022 నుంచి మార్చి 2023 వరకు జరిగిన ఉపాధి హామీకి సంబంధించి 424 పనులకు వేజ్ రూ.4,15,20,959, మెటిరియల్ రూ.24,31,107 మొత్తం రూ.4,39,52,066, పంచాయతీరాజ్‌కు సంబంధించి వేజ్ రూ.50,252, మెటిరియల్ రూ.69,21,442 మొత్తం రూ.69,71,694కు సంబంధించి 24 గ్రామ పంచాయతీల్లో సామాజిక తనిఖీ బృందం వారు తనిఖీలు చేపట్టారు. గ్రామ పంచాయతీల వారిగా సామాజిక తనిఖీ బృందం వారు ప్రజావేదికలో తనిఖీల వివరాలు వెల్లడించారు. తనిఖీల్లో ఉపాధిహామీ పనుల్లో మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో అవకతవకలు జరిగినట్టు తనిఖీ బృందం వారు గుర్తించారు. మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీలో భారీగా అవకతవకలు జరిగినట్టు గుర్తించారు. ఈ ప్రజావేధికలో ఎంపీపీ ముత్తినేని సుజాత, ఎంపీడీఓ వరప్రసాద్, ఎస్ఆర్‌పీ రాజు, డీఆర్‌పీలు, సామాజిక తనిఖీ బృందం సభ్యులు, ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ కూలీలు పాల్గొన్నారు.

సమగ్ర దర్యాప్తు చేపట్టాలి

మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీలో 2022–23 సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో అవకతవకలపై, 2018–2023 సంవత్సరాల కాలంలో పంచాయతీలో జరిగిన అభివృద్ధి పనులపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డీఆర్‌డీఏ అధికారులకు మల్లెలమడుగు గ్రామస్తులు బుధవారం వినతిపత్రం అందజేశారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జరిగిన 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేధికలో మల్లెలమడుగు గ్రామంలో అవకతవకలు జరిగినట్టు సామాజిక తనిఖీ బృందం వారు నిర్ధారించారు. గ్రామంలో ఉపాధి హామీ పనుల్లో అవకతవకలపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేపట్టాలని గ్రామస్తులు కోరగా వారం రోజుల్లో జిల్లా బృందంతో దర్యాప్తు చేయించి, నిధులపై రికవరి చేయిస్తామని డీఆర్‌డీఏ ఏపీడీ గ్రామస్తులకు తెలిపారు.

సీఎం పర్యటన నిరాశే మిగిల్చింది..



సమావేశంలో మచ్చ వెంకటేశ్వర్లు, పక్కన అఖిలపక్షం నాయకులు

భద్రాచలంఅర్బన్: సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 11న తేదీన చేపట్టిన భద్రాచలం పర్యటనలో భద్రాచలం పట్టణాభివృద్ధి, సమస్యలపై నిర్దిష్టమైన ప్రకటన చేస్తారని కోటి ఆశలతో ఎదురుచూసిన స్థానిక ప్రజలకు నిరాశే మిగిలిందని అఖిలపక్ష రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు పేర్కొన్నాయి. సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి అధ్యక్షతన బుధవారం జరిగిన అఖిలపక్ష పార్టీల ప్రెస్‌మీట్‌లో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు మచ్చ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. భద్రాచలం పట్టణంలో ఉన్న ప్రధాన సమస్యలు కరకట్ట, ఐదు గ్రామ పంచాయతీలు, శ్రీరాముడి ఆలయం అభివృద్ధి, ప్రభుత్వ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న డాక్టర్ పోస్టులను భర్తీ చేయడం తదితర ప్రధాన అంశాలపై నిర్దిష్టంగా ముఖ్యమంత్రి మాట్లాడకపోవడం పట్ల ప్రజల్లో నిరాశ మిగిలిందన్నారు. విలేకరుల సమావేశంలో సీపీఐ నాయకుడు రావులపల్లి రవికుమార్, బీఆర్ఎస్ నాయకులు అరికెల తిరుపతిరావు, తెలుగు దేశం నాయకుడు కొడాలి శ్రీనివాసరావు, సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ నాయకురాలు కెచ్చెల కల్పన, మాల మహానాడు అధ్యక్షుడు దాసరి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ల ఏర్పాటుపై హర్షం



ములకలపల్లిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న మున్నూరుకాపు సంఘం నాయకులు



చంద్రుగొండ: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పాలాభిషేకం..

ములకలపల్లి: మున్నూరుకాపులకు కార్పొరేషన్ కేటాయించడంపై హర్షం వ్యక్తం చేస్తూ మున్నూరు కాపు సంఘ మండలకమిటీ ఆధ్వర్యంలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మిఠాయిలు పంచిపెట్టారు. ములకలపల్లిలో ఏర్పాటు చేసిక కార్యక్రమాన్ని ఉద్దేశించి సంఘ మండల అధ్యక్షుడు మేకల పెద్దవెంకన్న మాట్లాడారు. శనగపాటి సీతారాములు, బుగ్గారపు సత్యనారాయణ, పుష్పాల చందర్‌రావు, శనగపాటి అంజి, అయతా శేషగిరి, పువ్వాల శ్రీనివాస్, శనగపాటి రవి, సీతయ్య, ఉమేశ్, వెంకన్న పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో..

ఆర్యవైశ్యులకు కార్పొరేషన్ కేటాయించడంపై సంతోషం వ్యక్తం చేస్తూ, స్థానిక సాయిబాబా మందిరంలో ఆర్యవైశ్య సంఘం మండలకమిటీ ఆధ్వర్యంలో బుధవారం సమావేశం ఏర్పాటు చేశారు. సంఘ మండల అధ్యక్షుడు అత్యం రాంబాబు మాట్లాడారు. సంఘ రాష్ట్ర అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ, నాయకురాలు కాల్వ సుజాతకు ధన్యవాదాలు తెలిపారు. అద్దంకి రమేశ్, ఓబులశెట్టి ప్రభాకర్, పద్దం నర్సింహారావు, అత్యం మణికంఠ సాయి, బిక్కుమళ్ల సుధాకర్, చిట్లూరి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

చంద్రుగొండ: కార్పొరేషన్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో మండలకేంద్రం చంద్రుగొండలో మున్నూరుకాపు సంఘం, ఆర్యవైశ్య సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఆర్యవైశ్యసంఘం నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మున్నూరు కాపుసంఘం నాయకులు కేక్‌కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. ఆర్యవైశ్యసంఘం నాయకులు పసుమర్తి శేషగిరిరావు, సంకా రామారావు, సంకా శంకర్, సంకా కృపాకర్, కే హరిబాబు, కాపుసంఘం నాయకులు రామిశెట్టి సైదయ్య, వెలగల మధు, లంకా నర్సింహారావు, పులి సత్యం, చిట్టంచెట్టి నవీన్, శెట్టిపల్లి కృష్ణయ్య, సుంకర రామారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: పెరిక కుల కార్పొరేషన్ ఏర్పాటుకి తెలంగాణ క్యాబినెట్ ఆమోదం తెలపడం కాంగ్రెస్ పార్టీ తీసుకున్న చారిత్రక నిర్ణయం అని టీపీసీసీ సభ్యుడు, పెరిక కుల కార్పొరేషన్ సాధన సమితి వైస్ చైర్మన్ బుడగం శ్రీనివాస్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పెరిక కుల కార్పొరేషన్ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పాటు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావుకి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.